Andhra Jyothi

## ఎంబీబీఎస్ పోస్టుల్లో

# ఆయుష్ డాక్టర్లు

- 160 వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ వైద్యుల పోస్టుల్లో ఆయుష్ డాక్టర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా సుమారు 160 ఎంబీబీఎస్ పోస్టుల్లో ఆయుష్ వైద్యులను నియమించనున్నారు. ఈ ప్రకారం ఆయా జిల్లా కలెక్టర్లకు తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ బుద్ధప్రకాష్ ఆదేశాలను జారీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే విభాగంలో పనిచేయడానికి వీలుగా రాష్ట్రానికి 280 ఎంబీబీఎస్ వైద్యుల పోస్టులను భర్తీ చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ వైద్యులకు చెల్లించే జీత భత్యాలను కూడా కేంద్ర ప్రభుత్వమే సమకూర్చనుంది. అర్బన్ హెల్త్ మిషన్, రూరల్ హెల్త్ మిషన్‌లో భాగంగా ఈ వైద్యులు పేద ప్రజలకు సేవలను చేయాల్సి ఉంటుంది. అవసరమైన వైద్య పరీక్షలను, మందుల సరఫరాను కూడా ఉచితంగానే అందిస్తున్నారు. ఈ సేవల కోసం ఏడాదికి సుమారు రూ. 1000 కోట్లను ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయితే ఈ పోస్టుల భర్తీకి ఇప్పటికే రెండు సార్లు ప్రత్యేక నోటిఫికేషన్‌ను జారీ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. గత ఏడాది ఆగస్టు 21వ తేదీన, తర్వాత ఈ ఏడాది జూలై 22వ తేదీన నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కేవలం 120 మంది వైద్యుల పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 160 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ పోస్టుల్లో చేరడానికి ఎంబీబీఎస్ వైద్యులు ముందుకు రావడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉండడంతో వైద్యులు ఈ పోస్టులపై ఆసక్తిని కనబరచడం లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయుష్ వైద్యులను ఈ ఎంబీబీఎస్ పోస్టుల్లో నియమించాలని తాజాగా నిర్ణయించారు.

---

## జిల్లాల వారీగా ఖాళీల వివరాలు

| జిల్లా పేరు | పురుష వైద్యులు | మహిళ వైద్యులు | మొత్తం |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 16 | 17 | 33 |
| నిజామాబాద్ | 14 | 12 | 26 |
| ఆదిలాబాద్ | 12 | 11 | 23 |
| హైదరాబాద్ | 10 | 8 | 18 |
| కరీంనగర్ | 10 | 7 | 17 |
| వరంగల్ | 10 | 5 | 15 |
| ఖమ్మం | 9 | 4 | 13 |
| నల్లగొండ | 4 | 4 | 8 |
| రంగారెడ్డి | 3 | 4 | 7 |
| మొత్తం | 88 | 72 | 160 |